# హత్యకాని హత్య

హత్య అంటూ వొకటి జరుగుతే, అది ఏదో విధంగా బయటపడక తప్పదు. అపరాధ పరిశోధకుల నైపుణ్యంవల్లకానీ, మానవాతీతమైన శక్తులు కొన్ని పనిచేసి, కేసుకు బలాన్ని చేకూర్చే సాక్ష్యం లభించటంవల్లకానీ, దాదాపు నూటికి తొంభై కేసులు బయటపడుతూనే వుంటాయి.

1943 లో లక్నోలో జరిగిన గౌరి హత్య కేసు చాలా విచిత్రమైనది. ఆ కేసులో, సంఘం దృష్టిలో మహోన్నత స్థానాన్ని అలంకరించి, వొక్క పెద్ద వుద్యోగం చేస్తున్న ఐ. సి. యస్. ఆఫీసర్ యిరుక్కున్నాడు. అది చాలా విచిత్రంగా జరిగింది. అందువలన ప్రజలు చాలా రోజుల వరకూ ఆ ఆఫీసర్ నిజంగా ఈ హత్య చేసి వుంటాడని నమ్మలేకపోయారు. కొందరు రకరకాలుగా చెప్పుకున్నారు. గౌరికీ అతనికీ ఏదో సంబంధం వుందనీ, యిద్దరిమధ్య చెడటంవలన ఈ హత్య జరిగిందనీ కొందరు అపోహపడ్డారు. నిజానికి అలాంటి అపోహలకు కారణం లేకపోలేదు. గౌరి, చాలా తక్కువస్థాయి కుటుంబంలో పుట్టి పెరిగింది. సహజంగా ఆమె చాలా అందంగా కూడా వుంటుంది. చివరికి ఆమె సౌందర్యమే ఆమె పతనానికి దారితీసింది.

ఏది ఎలావున్నా, వొకానొక పెద్ద ఆఫీసర్, వొకదాసీపిల్లను హత్యచేయవలసిన అవసర మేమిటో ఎవరికీ బోధపడలేదు. పోలీసువారు ఈ విషయం గురించి తీవ్రంగా ఆలోచించి, కేసుకు సంబంధించిన సాక్ష్యాల సేకరించి, చివరికి ఆ ఆఫీసర్ (భూషన్‌సింగ్) హంతకుడని తేల్చారు. ఈ విషయం తెలుసుకుని ప్రజలందరూ ఆశ్చర్యపోయారు. ఎంత ఆలోచించినా, భూషన్‌సింగుకూ, ఈ హత్యకూగల సంబంధమేమిటో వారికి సరిగా అర్థంకాలేదు.

గౌరి, భూషన్‌సింగు యింట్లో దాసీగా పనిచేస్తోంది. చాలా నమ్మకంగానే వుంటోంది. నిండు యౌవనంలో వున్న ఆమె, ఎంతటి ప్రవరాఖ్యుడినైనా ఆకర్షింపగల సౌందర్యం కలిగివుంది. అందమైన ముఖం-పొట్టిగా, నాజూగ్గావున్న ముక్కు-లేత గులాబీ రేకులను వెక్కిరించే పెదవులు-స్నిగ్ధమూ, కోమలమూ అయిన చెక్కిళ్ళు-చూడటానికి తీగ సంపెంగ మాదిరిగా విలాసంగా నాజూగ్గా వుంటుంది. ఆమె నవ్వుతుంటే గులాబీపువ్వు రేకులు విచ్చుకున్నట్లు-మయూరం పచ్చగడ్డిమీద పింఛం విప్పుకున్నట్లు-రమణీయంగా వుంటుంది. ఇంతటి సౌందర్యాన్ని, గౌరి బజారుపాలుచేస్తూ, యౌవనాన్ని ఆయుధంగా వుపయోగించి డబ్బు సంపాదించటానికి పూనుకుంది. అందుకే, భూషన్‌సింగు, ఆమెపట్ల ద్వేషం పూనాడు.

దాదాపు వొక నెల రోజులు, గౌరి



# ★ హత్యకాని హత్య ★

హత్యనుగురించి పరిశోధనలు జరిపాక, భూషన్‌సింగు హంతకుడని తేల్చి, అతనిని అరెస్టు చేశారు. అతనితోపాటు, ఈ కేసుకు సంబంధం వుందని అనుమానింపబడుతున్న యింకొక నలుగురు వ్యక్తులనుకూడా అరెస్టు చేశారు.

* * *

భూషన్ సింగు, మిశ్రా పక్క పక్క యిండ్లలో కాపురంచేస్తూ లక్నోలో వుంటున్నారు. ఇద్దరూ ఐ. సి. యస్. ఆఫీసర్లు అయినా, రెండు యిళ్ళ మధ్య రాకపోకలు లేవు. ఈ యింటిమీది కాకి ఆ యింటిమీద వాలదు. ఆడవాళ్ళ మధ్యకూడా బాగా మనస్పర్థలు వున్నాయి. ఒకానొకవిషయంమీద యిద్దరి ఆఫీసర్లకూ వివాదం ఏర్పడి, అప్పటినుంచీ, వొకరితో వొకరు మాట్లాడుకోవడం మానుకున్నారు. ద్వేషాలు పెరిగి, వొకరిపై వొకరు పగ సాధించుకోవడానికి అవకాశం కోసం ఎదురుచూస్తున్నారు.

భూషన్ సింగు వుంటున్న బంగళాకు దగ్గరలోనే వొక గుడిసెలో గౌరి వుంటున్నది. రోజూ నాలుగు యిళ్ళలోనూ అన్ని పనులు చేస్తూ, ఆ జీతంతో కాలక్షేపం చేస్తోంది. దానితో తృప్తిపడక, తళుకు బెళుకులు చూసి మోసపోయే యువకులను తన వలలో వేసుకుని, తన యౌవనాన్ని రూపాయిలలోనికి మార్చి లెక్క చూసుకుంటోంది. మొదట్లో ఈ విషయం భూషన్ సింగు దృష్టిలోనికి వచ్చినా, అతను లెక్క చేయలేదు. తనకెందుకని వూరుకున్నాడు. కాని, రాను రాను ఈ వ్యాధి విపరీత పరిణామాలకు దారితీసి, ప్రజలలోనికి ప్రాకిపోయి, తన ప్రతిష్ఠకు భంగం వాటిల్లిపోతున్నదని గుర్తించాక, అతను మౌనంగా వూరుకోలేకపోయాడు. గౌరిని పిలిచి గట్టిగా మందలించాడు. సరిగా ప్రవర్తించకపోతే, అక్కడనుంచి గుడిసె పీక్కుని లేచిపొమ్మని హెచ్చరిక చేశాడు. కాని, గౌరి అతని మాటలు వినలేదు. పైగా ఆమెకోసం వచ్చిపోయే వ్యక్తులతో ఆ ప్రాంతంలో సందడి ఎక్కువయింది. ఈ విషయం గౌరవ మర్యాదలతో బ్రతికే భూషన్‌సింగుకు భరింపరానిదయింది.

ఇది యిలా వుండగా, వొకరోజు రాత్రి గౌరి వూళ్ళో కనపడకుండా మాయమయింది. అందుకు భూషన్‌సింగు కారకుడని అనుకోవటానికి అవకాశం లేకపోలేదు. అతని యింట్లో చాలా రోజులుగా పనిచేస్తూ వున్న మనిషి హఠాత్తుగా మాయమెలా అవుతుంది? భూషన్‌సింగు ఆమెను హత్య చేసి, ఎవరికీ తెలియకుండా శవాన్ని వూరి బయటికి పంపించివుంటాడా? లేదా, గౌరికీ వారికీ పొత్తు కుదరక ఆ ప్రాంతంనుంచి లేచి పొమ్మన్నారా?— ఇలాంటి ప్రశ్నలు ఎన్నో వుత్పన్నమయినయి. అందుకు వచ్చిన సమాధానాలు మాత్రం అంత తృప్తికరంగా లేవు. ఏమయినా గౌరిని గురించిన వదంతులు మాత్రం ప్రజలలో బాగా ప్రాకిపోయినాయి. గౌరిని బాగా ఎరిగున్న కొందరు వ్యక్తులు, భూషన్‌సింగే, ఈ హత్య స్వయంగా దగరవుండి జరిపించి వుంటాడని వూహాగానం చేశారు కొందరు. ఈ విషయాన్ని బహిరంగంగా వ్యక్తం చేశారు, దానితో నలుగురూ నాలుగు రకాలుగా చెప్పుకున్నారు.

నెమ్మదిగా ఈ హత్యాకాండను గురించిన వివరాలు ప్రభుత్వం దృష్టిలోనికి పోయినాయి. వెంటనే, భూషన్‌సింగును, వుద్యోగంలోనుంచి తాత్కాలికంగా "సస్పెండు" చేశారు. ఈ అవమానంతో అతను బాగా కృంగిపోయాడు. తనకూ, ఈ హత్యకూ అసలు సంబంధంలేదని వాదించాడు. కానీ అతని మాటలు ఎవ్వరూ నమ్మలేదు.

పోలీసువారు గౌరిని గురించి దర్యాప్తు జరుపుతున్నారని తెలియగానే, ప్రజలు ప్రచారంలోవున్న వదంతులు వారికి తెలియచేశారు. ఈ వదంతులను ఆధారంగా తీసుకుని, కేసుకు సంబంధించిన అన్ని వివరాలనూ సేకరించటానికి వారు వుపక్రమించారు. చివరికి భూషన్‌సింగునూ, అతని బావమఱది భవానీసింగునూ యింకా మరి ముగ్గురినీ అరెస్టుచేశారు.

ఒక ఐ. సి. యస్. ఆఫీసర్ను, వొకానొక హత్యకేసులో నేరస్థుడుగా పట్టుకోవటం, చరిత్రలో మొదటిసారి కావచ్చును. కానీ, న్యాయానికి మనుష్యుల అంతస్తులతో నిమిత్తంలేదు. ధనికుడు కానీ బీదవాడు కానీ, అందరికీ వొకటే న్యాయం. అందరూ చటబద్ధులే! అందువలన భూషన్‌సింగువంటి పెద్ద ఆఫీసర్, గౌరవంగా బ్రతికిన వ్యక్తి, వొక సామాన్య దాసీమనిషి హత్యకేసులో నేరస్థుడుగా కోర్టు ఎదుట నిలబడ్డాడంటే ఆశ్చర్య పడనవసరంలేదు. ధర్మం స్వయం శక్తివంతమయినది.

లక్నో సెషన్సు జడ్జిముందు, ఈ హత్యకేసు విచారణకు వచ్చింది. ఆనాడు కోర్టుహాలు జనంతో కిటకిటలాడింది. ఒకానొక పెద్ద ఆఫీసర్, హత్యకేసులో నిందుతునిగా వారు చూడటం యిదే మొదటిసారి.

కోర్టుహాలంతా కాసేపటిలో నిశ్శబ్దం ఆవరించింది. అందరూ, ఏమి జరుగుతుందోనని ఆదుర్దాగా ఎదురు చూస్తున్నారు. ఇంతలోనే, న్యాయాధిపతి వచ్చి న్యాయపీఠాన్ని అలంకరించాడు. న్యాయవేత్తలు, న్యాయవాదులుకూడా తమ తమ స్థానాలలో కూర్చున్నారు. విచారణ ప్రారంభమయింది. భూషన్‌సింగుపై మోపబడిన నేరాలను కోర్టువారు చదివారు. అతను గౌరిని హత్యచేయడమేకాక, సాక్ష్యాలు దొరకకుండా నివారించడానికి గట్టి ప్రయత్నంచేశాడని అతనిపై నేరం ఆరోపింపబడింది. ఈ విషయం విని అందరూ నిర్ఘాంతపోయారు.

నేరస్థులెవరూ, తమపై తేబడిన అభియోగం నిజమని వొప్పుకోలేదు.

న్యాయాధిపతి, ఈ హత్యకేసులో, వొక పెద్ద అధికారిపై అభియోగం తేబడినదనే సంశయం, సంకోచం లేకుండా, నిష్పక్షి




కంగా వ్యవహరించమని, న్యాయవాదులకూ, సాక్షులకూ సలహా యిచ్చారు. ప్రాసిక్యూషన్ వారి కథనం ప్రారంభించారు.

1948, మే నెలలో వొకరోజున (26వ తారీఖు), భూషన్ సింగు యింట్లో వంటలు చేసే సింహాద్రితో రాత్రి 7-30 గంటల వేళ సరసాలాడుతున్నది. సరిగా అదే సమయానికి భూషన్ సింగు ఆఫీసునుంచి తిరిగివచ్చి, వంటింటోనుంచి కిలకిలమని నవ్వులు విని గబగబా తలుపులు తీసుకుని లోపలకు జొరబడాడు. అక్కడ అతను చూసిన దృశ్యం అతన్ని కోపాగ్నిలో ముంచి, అతనిని వొక పశువుగా తయారు చేసింది. అతను ఆవేశంలో గౌరిని జుట్టుపట్టుకుని హాలులోనికి ఈడ్చుకువచ్చి, యిష్టం వచ్చినట్లు బాదాడు. అంతటితో వూరుకోక, వొక కర్ర తీసుకుని తలపై గట్టిగా మోది, తనగదిలోకి వెళ్ళాడు. గౌరి పెద్ద పెద్ద పెట్టున గోలపెడుతూ అక్కడే కూలబడి పోయింది.

తర్వాత, భూషన్ సింగు భోజనం చేసి రాత్రి పదిగంటల వేళ గౌరినివచ్చి చూశాడు. అప్పటికి గౌరి మరణించింది. భూషన్ సింగుకు ఏమీ చేయటానికి తోచలేదు. వెంటనే, భార్యతో ఈవిషయం చెప్పాడు. ఇద్దరూ కాసేపు ఆలోచించి, చివరకు శవాన్ని, పదిమైళ్ళ దూరంలో వున్న భూషన్ సింగు బావమఱది యింటికి చేరవేయడానికి నిశ్చయించారు. వెంటనే శవాన్ని వొక పెట్టెలో పెట్టి భూషన్ సింగు, తన నౌకర్ని తోడుతీసుకుని కారులో ప్రయాణమయాడు.

కారు పోతూ వుండగా, దోవలో, వొక టైరుకు 'పంచరు'పడి, కారు ఆగిపోవలసి వచ్చింది. వెంటనే, భూషన్ సింగు, అతని నౌకరు, దోవన పోతున్న వొక బండిని ఆపారు. అందులో సింగు ముందు వెళ్ళిపోయాడు. అతనువెళ్ళి, విషయమంతా బావమఱదితో చర్చించి శవాన్ని కారులో నుంచి తీసుకురావడానికి ఏర్పాట్లు చేశాడు. శవాన్ని తీసుకువచ్చాక, భవానిసింగు (బావమఱది) తన నౌకరను యిద్దర్ని పంపి శవాన్ని అడివిలో పారవేయడానికి ఏర్పాట్లు చేశాడు. దాని ప్రకారం శవం అడివిలో ముక్కలు ముక్కలుగా ఖండించబడి, శవం యొక్క నామరూపాలు లేకుండా పోయింది.

భవానీసింగ్ యింటికి పోలీసువారు, 28వ తేదీన వెళ్ళారు. అప్పటికి హత్య జరిగి రెండు రోజులయింది. గౌరి కనపడటం లేదనే వార్తను ఆధారంగా తీసుకుని పోలీసువారు దర్యాప్తు ప్రారంభించారు. భవానీసింగు యింటి పక్కనున్న వాళ్ళను, బండి వాళ్ళను పరీక్షించి, కేసుకు సంబంధించిన అన్ని వివరాలనూ సమకూర్చుకున్నారు. భవానీసింగ్ యింట్లో పని చేస్తున్న వాసంతి, కొన్ని ముఖ్యమైన వివరాలను పోలీసువారికి తెలియ చేసింది. ఆమె, చచ్చిపోయిన గౌరికి దగ్గరబంధువు. అందుకే ఆసక్తితో అన్ని విషయాలూ చెప్పింది.

భవానీసింగ్ నౌకర్లను బెదిరించగా వాళ్ళు నేరం వొప్పుకున్నారు. వారు చూపిన చోటికి వెళ్ళి, అక్కడ దొరికిన ఎముకలు తీసుకున్నారు. తర్వాత వాళ్ళను, భవానీసింగ్ ను అరెసు చేశారు. వాళ్ళను లక్నో తీసుకువచ్చారు. భవానీసింగ్ ను బెదిరించారు కాని, అతను నేరం వొప్పుకోలేదు.

కోరులో సాక్షుల విచారణ కూడా పూర్తి అయింది. భూషన్ సింగ్ మౌనంగా అంతా విని వూరుకున్నాడు. అదంతా నిజమనలేదు! బూటకమని వాదించనూలేదు!! నిండుకుండలాగా వూరుకున్నాడు.

తర్వాత న్యాయాధిపతి, భూషన్ సింగ్ వైపుకు తిరిగి, "నీవు చెప్పవలసింది ఏమన్నా వుందా!" అని ప్రశ్నించాడు.

"చాలావుంది" అన్నాడు సింగ్. ఒక నిముషమాగి "ఈ కేసుకూ, నాకూ ఎటి సంబంధమూ లేదు. గౌరి అసలు అదృశ్యమై వుండవచ్చును. అంతేకానీ, నేను ఆమెను హత్య చేశాననటం అవివేకం! ఏవో ప్రజలలో చెలరేగిన పుకారను ఆధారంగా తీసుకుని, వొక గౌరవకుటుంబీకుడననే భావం కూడా లేకుండా, నన్ను నిర్దాక్షిణ్యంగా అరెసు చేసి, నా గౌరవ మర్యాదలను మంటకలిపారు. గౌరి మా యింట్లో పనిచేస్తున్నది. ఆమె ప్రవర్తన నాకేమీ నచ్చలేదు. నాలాంటి గౌరవ కుటుంబికుల నివశించే ప్రాంతంలో, యిలాంటి నీచమైన వ్యక్తి, తన యిష్టం వచ్చినటు సంచరిస్తుంటే నేను వూరుకోలేక పోయాను. ఆమెను వొకసారి మందలించాను. కానీ ఆమె తన పద్ధతులను మార్చుకోలేదు. 26వ తేదీన, నేను యింటికి వచ్చేటప్పటికి మా నౌకరుతో ఈ గౌరిని చూశాను. నాకు కోపం వచ్చి కేకలేసి, రెండు దెబ్బలు కొట్టాను. తర్వాత ఆరాత్రి, నేనూ, నా భార్య బాగుగా ఆలోచించి, మా బావమఱది యింట్లో పని చేస్తున్న వాసంతికి ఈమెను అప్పచెపితే బాగుండునని నిర్ణయించుకున్నాము. ఆ రాత్రి కారులో గౌరిని అక్కడ దిగబెటి వచ్చాము. తర్వాత గౌరి ఏమయిందీ మాకు తెలియదు."

ఇంతవరకూ సింగ్ చెప్పిన కథకూ, ప్రాసిక్యూషన్ కథకు పెద్ద వ్యత్యాసమేమీ లేదు. పోతే, గౌరిని సింగు మెమ్మదిగా కొట్టానంటున్నాడు. అదొక్కటే తేడా!

సింగ్ యింకా చెపుతునే వున్నాడు. "మేము మా బావమఱది గారింటికి వెళ్తుంటే దారిలో కారుకు 'పంచరు' పడింది. అప్పుడు నేను, నా భార్య, గౌరిని వెంటపెట్టుకుని మిగతా రెండు మైళ్ళు నడచి వాళ్ళ యిల్లు చేరుకున్నాము. ఆ రాత్రి అక్కడవుండి, తెల్లవారిన తర్వాత కారు తెప్పించుకుని, నా నౌకరుతో సహా నేను మళ్ళీ లక్నో తిరిగి వచ్చాను. నా భార్యను వాళ్ళ అన్నగారింట్లో వదిలిపెట్టి తర్వాత రమ్మని చెప్పాను...తర్వాత కొద్దిరోజులకి, గౌరి మాయమయిందట. ఆమె ఏమయిందో మాకెవరికీ అంతుపట్టలేదు."

భూషన్ సింగ్ చెప్పిన ఈకథ ప్రకారం అసలు గౌరి మరణించలేదని, ఆమెను వాసంతికి అప్పచెప్పటంవరకే అతనికి తెలుసునని వ్యక్తం అవుతున్నది అంతేకాదు! భవానీసింగ్ యింటికి వెళ్ళేనాటికి గౌరి ఇంకా సజీవంగా వున్నదట! ఈకథలో అసలు బండివాడి ప్రసక్తి రానేరాదు. అలాగే, భవానీసింగ్ నౌకర్లకు ఈకథతో సంబంధంలేదు. 'ఈవిషయంలో, ప్రాసిక్యూషన్ క[illegible], భూషన్ సింగ్ కథకూ తీవ్రవ్యత్యాసం కనిపిస్తోంది.

భూషన్ సింగ్ వుంటున్న ఇంటికి సమీపంలో వుంటున్న మిశ్రా, సాక్ష్యమిస్తూ: మేనెల 26వ తేదీ రాత్రి, శ్రీ భూషన్



# హత్యకాని హత్య

సింగ్ కారులో బయలుదేరటం తాను చూశానని చెప్పాడు. ఈ విషయం నిజం కావచ్చును, లేదా, అతనికి సింగుఅంటే వున్న ద్వేషంవల్ల ఈవిధంగా చెప్పవచ్చును. ఏమయినా ప్రాసిక్యూషన్‌వారి కథనం బలవత్తరంగా వుంది.

సాక్ష్యాలు పూర్తయాక, భూషణ్‌సింగు తరపు లాయరు వాదిస్తూ "ఒక హత్య జరిగిందని ఒప్పుకు నేముందు, హంతకుడని అనుమానింపబడుతున్న వ్యక్తి అసలు ఈహత్య ఎందుకుచేశాడు, చేయటంలో అతని వుద్దేశం యేమిటి అని మనం ఆలోచించాలి. అంతే కానీ, ఎవరో చెప్పిన కట్టుకథలను ఆధారంగా తీసుకుని ఒక గౌరవ కుటుంబీకుని హంతకుడుగా నిర్ణయించటం అన్యాయం. అసలు శ్రీ భూషన్‌సింగ్, ఈ దాసి మనిషిని హత్య చేయవలసిన అవుసరమేముంటుంది? గట్టిగా మందలించి, ఆమెను ఆ ప్రాంతం నుంచి వెళ్ళగొట్టవచ్చునుకదా!...అలాంటప్పుడు సింగ్ ఆరాత్రి గౌరిని దెబ్బలు కొట్టాడంటే, అది పూర్తిగా పితృవాత్సల్యంతో కూడుకున్న ఉద్రేకం మాత్రమే. అంతేకాని, ఆమెను హత్యచేద్దామని అతను తలంచలేదు. పైగా తను కొట్టేన చిన్నదెబ్బలతో ఆమె మరణిస్తుందని అతను వూహించనూలేదు...నిజానికి ఒకరు మాత్రం వూహించగలరా!...కనుక, గౌరికి అంతకు పూర్వమే ఏదో వ్యాధి సంక్రమించివుండి, ఆవ్యాధివలన ఆమె మరణించివుండవచ్చును కనుక శ్రీ భూషన్‌సింగ్ నిర్దోషి...అంతే కాదు. ప్రాసిక్యూషన్ కథ పూర్తిగా తప్పుదోవ పట్టిస్తున్నది. వారు చూపించే ఏమకలు గౌరివేనని రుజువుచేయడం కష్టం" అంటూ పూర్తిచేశాడు.

తర్వాత పంచాయితీదారులు తమ అభిప్రాయం తెలియచేయడానికిగాను, ఒకగదిలోనికి వెళ్ళి సమావేశమయారు. అక్కడ కేసు వివరాలు తమలో తాము చర్చించుకున్నారు. ఈలోపల జనంలో సంచలనం బయలుదేరింది. భూషన్‌సింగ్‌కు మరణశిక్ష విధిస్తారని కొందరూ, అసలు అతను నిర్దోషి అని కొందరూ అనుకుంటున్నారు.

ఒక గంట తర్వాత పంచాయితీదారులు తమగదిలోనుండి బయటకువచ్చి తమ స్థానాలలో కూర్చున్నారు. నేరస్థులపై తేబడిన అభియోగం రుజువు కాలేదని వారు ఏకగ్రీవంగా చెప్పారు. అంతేకాదు! నేరస్థులు ఈ హత్యచేసి సాక్ష్యం దొరకకుండా చేయటానికి ప్రయత్నించారనటం హాస్యాస్పదం అన్నారు.

మర్నాడు న్యాయాధిపతి, ఈ కేసులో యిచ్చిన తీర్పు దీనికి విరుద్ధంగా వుంది. ఆయన తనతీర్పులో "ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం, సింగ్ ఆ రాత్రి గౌరిని కొట్టాడని రుజువవుతున్నది. కానీ సింగ్ చాలా నెమ్మదిగా కొట్టానంటున్నాడు. ఆమెకేదో వ్యాధి వుండటంవలన మరణించిందంటున్నాడు. ఇది అబద్ధం! సింగ్ ఆరోజు చాలా వుద్రేకంలో ఆమెను పట్టుకుని బాదాడు. ఇందులో సందేహంలేదు...... పోతే గ్రామస్థులు కొందరు ఆ రాత్రి భూషన్‌సింగ్ కారులో వెళ్తుంటే చూశామంటున్నారు. వారు చెప్పిన దానినిపట్టి గౌరి ఆ రాత్రి భూషన్ సింగ్‌తో ఆ కారులో ప్రయాణం చేయలేదని తెలుస్తున్నది. ఇది భూషన్‌సింగ్ తన వాఙ్మూలంలో చెప్పినదానికి పూర్తిగా విరుద్ధం! కనుక సింగ్ ఆ రాత్రి ఒక పెట్టెలో గౌరి శవాన్ని తీసుకువెళ్ళి వుండవచ్చును. వాసంతి చెప్పిన సాక్ష్యం ప్రకారం శవం ఆ రోజు రాత్రి భవానీసింగ్ యింటికి తీసుకు వచ్చినట్లు రుజువవుతున్నది. కనుక భూషన్ సింగ్ ఈ కేసులో నేరస్థుడు. అతనికి ఆరు సంవత్సరాల కఠినశిక్ష విధిస్తున్నాను" అన్నారు.

అంతవరకూ, నిశ్శబ్దంగా వింటున్న ప్రేక్షకులు యిది విని ఆశ్చర్యపడి, కొద్దిగా గోల చేయటంవలన న్యాయాధిపతి చివరి మాటలు వినపడకుండా పోయినాయి. పంచాయితీ దారులు యిచ్చిన అభిప్రాయానికి, న్యాయాధిపతి విరుద్ధంగా తీర్పు చెపుతాడని వారెన్నడూ వూహించలేదు. అందుకే వారిలో సంచలనం చెలరేగింది.

భూషన్‌సింగ్ తర్వాత కొద్ది రోజులకు జోధ్ న్యాయపీఠంలో తన తరపున 'అపీలు' దాఖలు చేయించాడు. అతను నాలుగు నెలలు కఠినశిక్ష అనుభవించాక, జామీను మీద విడుదల చేశారు. న్యాయపీఠంలో భూషన్‌సింగ్ తరఫున ప్రఖ్యాత న్యాయవాది ఇలా వాదించాడు: "ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం 26వ తేదీరాత్రి భూషన్ సింగ్, గౌరిని హత్యచేసి, శవాన్ని కారులో భవానీసింగ్ యింటికి తీసుకు వెళ్ళాడు. దారిలో కారు పంచరు పడినప్పుడు, దానిని వారు అక్కడ వదిలేసి వెళ్ళారు. ఒక్కరు కూడా కారు దగ్గరలేకుండా వెళ్ళారని, ఆ దారిన పోతున్న గ్రామస్థులు, యిచ్చిన సాక్ష్యంవల్ల ఋజువవుతున్నది. అలాంటప్పుడు బాగా చదువుకున్న ఈ ఆఫీసర్ నిజంగా హంతకుడయితే, శవాన్ని కారులో వదిలివేసి వెళ్ళటానికి సాహసిస్తాడా!... అలాగే, అతని బావమఱది భవానీసింగ్ హత్య సంగతి సరిగ్గా తెలుసుకోకుండా, తన నౌకర్లను పంపించి శవాన్ని నాశనం చేయిస్తాడా! అలా చేయించటం వలన తనకు వ్యతిరేకంగా వుపయోగపడగల సాక్ష్యాన్ని నిర్మించుకుంటాడా! బాగా చదువుకున్నవాడు, తెలివైనవాడు అయిన భవానీసింగ్ తాను ఈ కేసులో యిరుక్కుంటే రాగల పరిణామాలు ముందుగా గ్రహించలేనంతటి తెలివితక్కువవాడా!... కనుక, భూషన్‌సింగుకు కానీ, భవానీసింగ్‌కు కానీ ఈ హత్యలో సంబంధం వుందనటం పచ్చిఅబద్ధం! ఇదంతా పోలీసువారు అల్లిన కట్టుకథ. భూషన్‌సింగే నిజంగా హంతకు

(43-వ పేజీ చూడండి)




## పూవు మీ అదృష్టం చెప్పగలదు

నీ భవిష్యత్తులో ఏమి జరుగబోవునదిన్ని, నీ సరియైన దర్యనుగురించిన్నీ నీవు తెలుసుకొనగోరినట్లయితే ఒక పోస్టు కార్డుపైన నీకు యిష్టమగు ఒక పుష్పము పేరున్నూ, నీవు వ్రాయు తేదీ, వేళ వివరములున్నూ, నీ సరియైన చిరునామాయున్నూ వెంటనే వ్రాసి పంపుము.

జ్యోతిష శాస్త్రములోని రహస్య గణితము మూలముగా మేము గుణించి, నీవు కార్డువ్రాసిన తేదీ లగాయతు 12 మాసములలోను నీయొక్క అదృష్టము, లాభనష్టములు, జీవితమార్గము, ఏ వ్యవహారములో నీకు జయము కలుగునో, నీ ఉద్యోగం విషయంలో మంచిచెడ్డలు, మార్పులు, ఆరోగ్యవిషయము, పరదేశగమనము, తీర్థయాత్రలు, వివాహము, స్త్రీసుఖము, సంతానము, నిధినిక్షేపములు, లాటరీ, ఆకస్మాద్రవ్యలాభము మొదలగు వానినిగురించి స్పష్టముగా మాసవారీగా వ్రాసి రు. 1-4-0 లకు మాత్రము వి. పి. గా పంపగలము. (వి. పి. చార్జీలు ప్రత్యేకం) దుష్టగ్రహము లేవయినా వున్న యెడల శాంతిచేయు విధానంకూడా తెలుపగలము. వివరములు మా పూచీపైన పంపబడును. మేము పంపిన ఫోర్కాస్టు మీకు తృప్తిగా నుండనియెడల పైకము వాపసు చేయబడును. ఒకసారి పరీక్షించి చూడుడు. మీ అడ్రసు ఇంగ్లీషులో వ్రాయండి.

Pt. DevDutt Shastri, Raj Jyotishi (WP-13) Jullundur City.

# హత్యకాని హత్య

(16-వ పేజీ తరువాయి)

డయితే, యింత తెలివితక్కువగా, పోలీసులకు దొరికిపోయేవిధంగా ప్రవర్తించడు. కనుక అతను నిర్దోషి." అన్నారు.

కోరువారు ఈ వాదనను కొంతవరకూ అంగీకరిస్తూ, లక్నో కోర్టులో పంచాయితీదారులు చెప్పినట్లు, నేరస్థులపై తేబడిన అభియోగం పూర్తిగా రుజువుకావటంలేదు కానీ, అసలు గౌరిని ఆరోజురాత్రి సింగ్ చితకబాదాడనటంలో మాత్రం సందేహంలేదు, అన్నారు. మిగతా విషయాలు రుజువుకావటంలేదు, కనుక సింగ్ గౌరిని దెబ్బలు కొట్టిన నేరంపై (ఈ విషయం సింగ్ కూడా వొప్పుకున్నాడు) అతను లోగడ అనుభవించిన నాలుగునెలల కఠినశిక్షను ఖాయం చేస్తూ. యికముందు శిక్షఅనుభవించ నవసరంలేదని తీర్పుచెప్పారు.

భూషన్‌సింగ్ మళ్ళీ జైలుకు వెళ్ళవలసిన అగత్యం తీరిపోయింది. కానీ అతనికిమాత్రం తృప్తి కలుగలేదు. లోకం తనకేదో అన్యాయంచేసినట్లు బాధపడ్డాడు. తాను నిర్దోషినని మొరపెట్టుకుంటున్నా వినకుండా నాలుగునెలల శిక్షను ఖాయంచేశారు. ఎంత అవమానం!...ఎప్పుడూ విందులూ, వినోదాలతో తులతూగుతూ, సంఘం దృష్టిలో ఉన్నత స్థానాన్ని అలంకరించిన తాను వొక సామాన్య ఖైదీలాగా, చెరసాలలో కవాటాల వెనుక బంధింపబడ్డాడు. నాలుగునెలలు కఠినశిక్ష అనుభవించాడు. మెత్తని పరుపులపై విశ్రమించే తాను, కఠిన శిలలపై పవ్వళించాడు. అందరితోపాటు గంజి త్రాగాడు...చివరికి ఈనాడు విడుదలయినాడు. కానీ సంఘం దృష్టిలో తానింకా నేరసుడు! ఒక దాసీదానిని అమానుషంగా హత్యచేసిన హంతకుడు! అంతకంటే ప్రపంచానికి వివరాలు తెలియదు. తెలుసుకోవలసిన అవుసరంకూడా లేదు. పత్రికల మూలంగా తనపేరు దేశమంతటా, వొక హంతకుడిగా వ్యాపించింది. ఇప్పుడు తాను సంఘం నోరుమూయలేడు. మళ్ళీ తన పరువుప్రతిష్ఠలను సంపాదించుకోలేడు. ఈ అవమానం భరించటంకంటే హాయిగా చావటం మేలు!...కానీ, అది పిరికివాళ్ళు చేయవలసినపని. తనలాంటి చదువుకున్నవాడు సంఘాన్ని చూసి భయపడి పారిపోవాలసిన అవుసరంకాని, ఓటమిని అంగీకరించవలసిన అగత్యంకానీ లేదు......కనుక, ధైర్యంగా సంఘాన్ని ఎదిరించాలి. అప్పుడే తన జీవిత లక్ష్యం నెరవేరుతుంది. ఇలా అనుకుంటూ, భూషన్‌సింగ్ తన కేసును ప్రీవీ కౌన్సిలుకు తీసుకువెళ్ళాలని నిర్ణయించుకున్నాడు.

ఈ విషయం పత్రికల మూలంగా విని ప్రజలు ఆశ్చర్యపోయారు. ఒక హంతకుడు సంఘాన్ని ధిక్కరించి, తానే ఎదురు రావడం చాలా వింతగానే వుంది! భారతదేశంలోని నలుమూలలా ఈ వార్త వ్యాపించింది. అందరూ 'ఏమి జరుగుతుందో'నని ఆదుర్దాగా ఎదురుచూడటం మొదలుపెట్టారు. పత్రికలు ఈ కేసునుగురించి విశేషంగా వార్తలు ప్రచురిస్తూ, ఎప్పటికప్పుడు ప్రజలను పరిస్థితిని తెలియచేస్తున్నాయి. అందరూ ఆసక్తితో ఆ వార్తలు చదువుతున్నారు.

భూషన్‌సింగ్ మొదట ప్రీవీకౌన్సిలుకు వెళ్ళటానికి తటపటాయించాడు కాని, అతని మిత్రులు ఆర్థికంగా సహాయంచేసి, అతను కౌన్సిలుకు వెళ్ళే, అతనిపై కేసు కొట్టివేయబడుతుం దనీ, అతని నిర్దోషి అని రుజువవుతుందనీ సలహా యిచ్చారు. వారి ప్రోత్సాహంతో సింగుకు నూతనోత్సాహం కలిగింది. ప్రీవీ కౌన్సిలులో "అపీలు" దాఖలుచేశాడు. తన తరఫున వొక పేరుపొందిన న్యాయవాదిని నియమించుకున్నాడు.

ఇంగ్లాండులో ప్రశాంత వాతావరణంలో ఈ కేసువిచారణ ప్రారంభమయింది. 1945వ సంవత్సరం అక్టోబరు 17 వ తేదీన తీర్పు చెప్పబడింది.

న్యాయమూర్తులు తమతీర్పులో, భూషన్ సింగ్ చెప్పినట్లు గౌరి ఏదో వ్యాధితో అప్పుడు బాధపడుతూ వున్నదని అంగీకరించారు. లేకపోతే, భూషన్‌సింగ్ కొట్టిన దెబ్బలకు ఆమె వెంటనే మరణించదు. ఒకవేళ సింగ్ ఆవేశంలో ఆమెను విపరీతంగా బాదివుంటాడని అనుకున్నట్లయితే, వెంటనే అతను డాక్టర్లను పిలిపించి తగిన చికిత్స చేసివుంటాడు. అంతేకానీ, గౌరి మరణిస్తుంటే అతను చూస్తూ వూరుకోడు! ఒకవేళ అతను వూరుకున్నా, అతని భార్య వూరుకోదు. వెంటనే డాక్టరుకు ఫోనుచేసుంది...పోతే, సింగ్ ఎంతవుద్రేకంతో గౌరిని కొటినా, ఆమె మరణిస్తే తనకు ప్రమాదమని గ్రహించలేక పోవడానికి, అతనేమీ తెలివితక్కువవాడు కాదు, లక్నోలో జరిగిన సంఘటనలను పరిశీలిస్తే, సింగు ఆరోజురాత్రి గౌరిని విపరీతంగా బాదాడని నిరూపించడానికి సాక్ష్యమేమీ లేదు. ఆమె స్పృహతప్పి పడివుండగా చూచినవారు కూడా లేరు. కనీసం ఆమెశవాన్ని కళ్ళారా చూచామని వొక్క సాక్షికూడా చెప్పలేదు. కనుక అసలు ఆమె హత్యచేయబడిన విషయమే రుజువుకావటం లేదు.

భూషన్‌సింగు యిచ్చిన వాఙ్మూలంలోని సత్యాన్ని క్రిందకోరువాళ్ళు విస్మరించారు. ప్రాసిక్యూషన్ కథను ఆధారంగా తీసుకుని అతనేహంతకుడని నిర్ణయించారు. ఇది అన్యాయం! ఒక ఐ. సి. యస్. ఆఫీసర్ తన యింట్లో పనిచేసే దాసీ మనిషి ప్రవర్తన, తన గౌరవ మర్యాదలకు కళంకం తెచ్చేటట్లుగావుంటే, వుద్రేకంలో ఆమెను కొటడం అర్థరహితం కాదు. గౌరవంగా బ్రతికేవారు యిటువంటి నీచమైన మనుష్యులను చూసి సహించలేరు. కనుక ఆ రోజు రాత్రి భూషన్‌సింగ్, గౌరిమీద ఆగ్రహించి, ఆమెను కారులో తీసుకువెళ్ళి వాసంతికి అప్పచెప్పి వుంటాడు. ఆ రోజు అర్థరాత్రి కారులో ప్రయాణం చేశాడు కనుక, భూషన్‌సింగే ఆమెను హత్యచేశాడనటం అవివేకం.

లక్నోలో సింగు గౌరిని కొడుతూవుండగా చూచిన సాక్షులు లేనందువ, ఆమెను సింగుహత్యచేసి పెట్టెలో తీసుకువెళ్ళాడని రుజువుకానందునా, ప్రీవీ కౌన్సిలులో భూషన్‌సింగు నిర్దోషి అనితేల్చారు. గౌరి, వాసంతి యింటిలోనుంచి మాయమయి వుంటుంది కానీ, ఈ హత్య చేయబడలేదని తీర్పు చెప్పారు.

ప్రజలందరూ ఆశ్చర్యపోయారు. రెండేళ్ళపైగా కోరులలో నలుగుతున్న ఈ కేసు ఈ విధంగా ముగుస్తుందని వారెన్నడూ వూహించలేదు. ఏమయితేనేమి! భూషన్ సింగ్ నిర్దోషి అని తేలింది. అయితే సంఘందృష్టిలో నేరస్థుడుగా జమకట్టబడి, మానసికంగా చాలా బాధపడిన భూషన్‌సింగుకూ యింకా తృప్తి కలుగలేదు. ఏదో తీరని లోటు అతనికి కనిపిస్తూనే వుంది.

భూషన్‌సింగ్ నిర్దోషి అని తీర్పు చెప్పగానే, మళ్ళీ అతని వుద్యోగం అతనికి తిరిగి యివ్వబడింది. కానీ సింగ్ జీవితం పథం పూర్తిగా మారిపోయింది. పిచ్చివాడిలాగా సంచరిస్తాడు. ఎప్పుడూ పరధ్యాన్నంగా వుంటాడు. ఒకదాసీమనిషి అతని జీవితంపై అటువంటి వింత ప్రభావం కలిగించిందంటే అందరూ ఆశ్చర్యపోయారు.

ప్రీవీ కౌన్సిల్ నుంచి తిరిగివచ్చిన కొద్దిరోజులకే సింగ్ భార్య హృద్రోగంవల్ల మరణించింది. ఆమె మరణించటంతో, భూషన్‌సింగ్ పూర్తిగా పిచ్చివాడయిపోయాడు. అతనికి జీవితంలో అసక్తి నశించింది. వైరాగ్యంతో మునిగి తేలుతూ, పిచ్చివాడులాగా తిరుగుతుండేవాడు. అతనికి పూర్వం రోజుల్లోవున్న గౌరవ మర్యాదలు లేవు. అతనిని గురించి ఎవ్వరూ ఘనంగా చెప్పుకోనటంలేదు. ఇప్పుడు సింగు లోకం దృష్టిలో హంతకుడు కాదు! ఒక పిచ్చివాడు.

కొన్నాళ్ళు మానసికంగా చాలా బాధపడి భూషన్ సింగ్ ఒకనాడు ఆత్మహత్య చేసుకున్నాడు. అప్పుడే అతనికి శాంతి లభించిందేమో! బహుశః గౌరికి జరిగిన అన్యాయానికి ప్రతిఫలమందుకున్నాడేమో! ★

(ఒక ఆంగ్ల కథ ఆధారంగా)